## క్లుప్తంగా

### కంచాకోడూరులో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



**గూడూరు:** గూడూరు మండలం కంచాకోడూరులో రక్షిత నీటి పథకం మరమ్మతులకు గురవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి అధికంగా ఉండటంతో సర్పంచి కోళ్ల హనుమంతరావు, ఈఓపీఆర్డీ టీవీ భాస్కరరావు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఈఓపీఆర్డీ భాస్కరరావు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. శుక్రవారం గ్రామంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను దగ్గరుండి ఈఓపీఆర్డీ పర్యవేక్షించారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### కనుల పండువగా కల్యాణోత్సవం



**టేకుపల్లి(మోపిదేవి):** టేకుపల్లి గ్రామంలోని బాల పార్వతీ సమేత రామేశ్వరస్వామి వారి దివ్య కల్యాణోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయ ధర్మకర్త యడవల్లి నీలలోహిత శాస్త్రి ఆధ్వర్యంలో రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి బ్రహ్మత్వంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణం జరిగింది. ఉదయం ఆరు గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, పంచామృత స్నపన, బలిహరణ, నీరాజన మంత్ర పుష్పములతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం, అనంతరం స్వామి వారి దివ్య కల్యాణోత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొన్ని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### జూన్ 1న గిరి ప్రదర్శనకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసు

**అవనిగడ్డ:** జూన్ ఒకటో తేదీన అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి గిరి ప్రదర్శనకు ప్రత్యేక సర్వీసు నడుపుతామని డిపో మేనేజర్ కె. హనుమంతరావు శుక్రవారం తెలిపారు. జూన్ ఒకటో తేదీన రాత్రి ఏడు గంటలకు అవనిగడ్డలో బయలు దేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, సిరిపురం, అరుణాచలం వెళ్లి దైవదర్శనం చేసుకోవచ్చున్నారు. అక్కడి నుంచి జూన్ 3వ తేదీన బయలుదేరి 4వ తేదీకి అవనిగడ్డ చేరుకుంటుందని చెప్పారు. వెళ్లి రావడానికి రూ.3 వేలు చార్జీ ఉంటుందని, ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని డీఎం వివరించారు.

### చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



**పెడన:** శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నందమూరు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ నరసింహారావు ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ వేసవిలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వారు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎంపీటీసీ ఉదయ్‌కుమార్, కళాశాల కరస్పాండెంట్ కుమార్‌బాబు, డైరెక్టర్ బాబా, ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### శాశ్వత భూ హక్కు పథకంపై రీ సర్వే



**పెడన:** పట్టణంలో వైఎస్సార్ శాశ్వత భూ హక్కు భూ పత్రం పథకానికి సంబంధించి రీ సర్వేకు చర్యలు చేపట్టామని పురపాలక పట్టణ ప్రణాళిక (టీపీఓ) అధికారి వి. ఏసుబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలో సర్వే చేసిన సమయంలో డ్రోన్ కెమేరాల ద్వారా గుర్తించిన పాయింట్స్‌ను రీ చెక్ చేశారు. ఈ సందర్భంగా టీపీఓ మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో 27 గ్రౌండ్ పాయింట్స్‌ను ఏర్పాటు చేశామని, తద్వారా రీ సర్వే చేస్తామని చెప్పారు. డ్రోన్ ద్వారా ఇమేజ్‌లు సేకరించనున్నామన్నారు. ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీలు జితేంద్ర, వినిల్‌కుమార్, డ్రోన్ ఏజెన్సీ బృందం పాల్గొన్నారు.

# శరవేగంగా గృహ నిర్మాణాలు

- 2,655 గృహ నిర్మాణాలు పూర్తి
- నిర్మాణంలో 5,045 గృహాలు
- ప్రారంభం కావాల్సినవి 520 గృహాలు





ఘంటసాల జగనన్న కాలనీ లేఅవుట్ 1లో గృహ నిర్మాణాలు ; చల్లపల్లి జగనన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి (ఫైల్)

**అవనిగడ్డ:** అవనిగడ్డ నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి. రెండు నెలల నుంచి గృహ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. కాలనీల్లో విద్యుత్ సౌకర్యం, రహదారులు, నీటి సదుపాయం కల్పించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**9,096 గృహాలు మంజూరు..**

నియోజకవర్గ చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆరు మండలాల్లో 9,096 మందికి జగనన్న కాలనీల్లో గృహాలను మంజూరు చేశారు. చల్లపల్లి మండలంలో అత్యధికంగా 2,011 గృహాలు మంజూరు కాగా, ఘంటసాలలో 1,953, నాగాయలంకలో 1,526, అవనిగడ్డలో 1,320, మోపిదేవిలో 1,144, కోడూరులో 1,142 గృహాలు మంజూరు అయ్యాయి. వీటిలో 8,222 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాల కోసం రిజిస్టర్ చేసుకున్నారు. వీటిలో అవనిగడ్డలో 333, చల్లపల్లిలో 555, ఘంటసాలలో 486, కోడూరులో 494, మోపిదేవిలో 351, నాగాయలంకలో 436 కలిపి మొత్తం 2,655 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. సన్‌సైడ్, స్లాబ్ లెవల్‌లో 2,431 గృహాలు ఉండగా, బేస్‌మెంట్ లెవల్‌లో 3,153 ఉన్నాయి. 22 గృహాలు ప్రారంభం కావాల్సి ఉంది. గత నాలుగు నెలలతో పోలిస్తే నిర్మాణ పనుల్లో 60 శాతం వేగం పుంజుకుంది.

**మౌలిక వసతులు కల్పించాకే..**

గతంలో చంద్రబాబు హయాంలో కాలనీల్లో నేటికి కొన్ని చోట్ల రహదారుల సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ముందుచూపు నిర్ణయం వల్ల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించిన తరువాతనే నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నారు. జగనన్న కాలనీలకు విద్యుత్ సౌకర్యం, రహదారుల నిర్మాణం, మెరక పనులతో పాటు ఇంటింటికీ కుళాయి కార్యక్రమాన్ని అమలు చేయడంతో గృహ నిర్మాణాలు చేసేందుకు లబ్ధిదారులు ఉత్సాహం చూపుతున్నారు. గతంలో వలే కాకుండా ఎప్పటి బిల్లులు అప్పుడు లబ్ధిదారుల ఖాతాల్లో జమకావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### సొంతింటి కల నెరవేరుతుంది



2009లో వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. సొంతిల్లు లేదు. నివేశన స్థలం కోసం గతంలో పలుసార్లు దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. ఇప్పుడు మంజూరైంది. ఇన్నాళ్లకు సొంతింటి కల నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– బూసం శ్రీనివాసులు, చల్లపల్లి

### రికార్డు స్థాయిలో గృహ నిర్మాణాలు



గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో గృహనిర్మాణాలు జరుగుతున్నాయి. జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పించిన తరువాతనే గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. పేదవాడి బతుకులు బాగుచేయాలని, గూడు కల్పించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారు. శవాలను పాతడానికి స్థలం సరిపోదని వెటకారంగా మాట్లాడుతున్న చంద్రబాబు ఆయన హయాంలో ఎందుకు స్థలాలు ఇవ్వలేదు.

– సింహాద్రి రమేష్‌బాబు, ఎమ్మెల్యే, అవనిగడ్డ

### డ్వాక్రా రుణాలు ఇప్పిస్తున్నాం



గతంలో కంటే గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. జగనన్న కాలనీల్లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నాం. డబ్బులు లేని వారికి రూ.35 వేలు డ్వాక్రా రుణాలు అందిస్తున్నాం.

– భానోజీరావు, హౌసింగ్ డీఈ, అవనిగడ్డ

### ఆదర్శ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య



మాట్లాడుతున్న హరిబాబు

**చల్లపల్లి:** మహోన్నత విలువలతో రాజకీయాలు చేసి కమ్యూనిస్టు పార్టీ కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన ఆదర్శ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా నాయకులు మాగంటి హరిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హరిబాబు మాట్లాడుతూ సుందరయ్య సేవలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు యద్దనపూడి మధు, ఆదిశేషు, వాకా రామచంద్రరావు, చల్లపల్లి గంగాభవానీ, మహమ్మద్ కరిముల్లా పాల్గొన్నారు.

### నేడు మండల పరిషత్ సమావేశం

**మోపిదేవి:** మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీఓ పార్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని చెప్పారు.

# పోర్టు నిర్మాణంతో జగన్ చరిత్రలో నిలుస్తారు

- ఏడాదికి పెడన దశ దిశ మారుతుంది
- 22న సీఎం చేతుల మీదుగా పోర్టు పనుల ప్రారంభం
- ప్రతి ఒక్కరికీ తెలిసేలా ప్రచారం చేయండి
- మంత్రి జోగి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

**పెడన:** మచిలీపట్నం పోర్టు నిర్మాణంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర పుటల్లో నిలుస్తారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శుక్రవారం సాయంత్రం పెడన మార్కెట్ కమిటీ సమావేశం హాల్‌లో పెడన నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఎనిమిది నెలల కిందట పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి రావాలని కోరినప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టు పనులు ప్రారంభించడానికే వస్తానని, శంకుస్థాపనకు రానని స్పష్టం చేశారన్నారు. ఆ మాటకు కట్టుబడి అన్ని అనుమతులు వచ్చిన తరువాత పోర్టు పనులను ప్రారంభించేందుకు ఈ నెల 22న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నం వస్తున్నారని చెప్పారు.

పోర్టు పనులు ప్రారంభించిన ఏడాదికే పెడన నియోజకవర్గం దశ దిశ మారుతుందన్నారు. పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలు వస్తాయని, రోడ్డు మార్గాలతో పాటు రైలు మార్గం కూడా మన నియోజకవర్గం నుంచే వెళుతుందని చెప్పారు. భూమి ధరలు కూడా బాగా పెరుగుతాయన్నారు. పోర్టు వస్తున్న విషయాన్ని ప్రజలందరికీ తెలిసేలా నాయకులు, పాలకులు నడుం బిగించాలన్నారు. సమయం లేదని, తక్కువ సమయంలో ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పోర్టు పనులు ప్రారంభానికి వస్తున్న విషయాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా మైకుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ప్రజలు ఎవరైనా స్వచ్ఛందంగా వస్తామంటే వారి కోసం వాహనాలను ఏర్పాటు చేసి తీసుకువచ్చే బాధ్యతను కొందరు తీసుకోవాలన్నారు. ఉదయం 8 గంటలకే సభా ప్రాంగణానికి చేరుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. సభకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగబాబు, మల్లికార్జునరావు, రాజబాబు, వెంకట్రాజు, రవి కుమార్, ఎంపీపీ మధుసూదనరావు, జెడ్పీటీసీలు రత్నకుమారి, సురేష్‌బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, నాయకులు గంగయ్య, వెంకట రామానాయుడు, అచ్యుతరావు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ముందు లోకేష్‌కు తెలుగు నేర్పించండి

**బుద్ధప్రసాద్‌కు ఎమ్మెల్యే సింహాద్రి హితవు**

**అవనిగడ్డ:** గతంలో తాను పోటీ చేసి ఓడిపోయిన మంగళగిరి నియోజకవర్గాన్ని మందలగిరిగా పలికే మీ పార్టీ నాయకుడు నారా లోకేష్‌కు ముందుగా తెలుగు నేర్పించాలని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తెలుగు నేర్పించమని అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబుకి మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ సూచించడం విడ్డూరంగా ఉందని సింహాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మా ముఖ్యమంత్రి తెలుగు చాలా స్పష్టంగా మాట్లాడతారని చెప్పారు. మంగళగిరిని మందలగిరిగా, ప్రశాంతతను ప్రశాంతత్తగా పలికే మీ పార్టీ నాయకుడు నారా లోకేష్‌కు ముందుగా తెలుగు నేర్పించాలని సూచించారు. తెలుగు సరిగా మాట్లాడని లోకేష్‌కు తెలుగు నేర్పించడానికి అవసరమైతే అధికార భాషా సంఘానికి సిఫార్సు చేస్తామని చెప్పారు. ఎప్పుడూ తెలుగు భాష గురించి మాట్లాడే బుద్ధప్రసాద్ చంద్రబాబు హయాంలో అధికార భాషా సంఘాన్ని ఎందుకు ఏర్పాటు చేయించలేక పోయారని ప్రశ్నించారు. తెలుగు భాషపై అంత మమకారం చూపుతున్న బుద్ధప్రసాద్ ఆయన పిల్లలు, మనుమళ్లను ఇంగ్లిష్ మీడియంలో ఎందుకు చదివించారని, నీతులు చెప్పే ముందు ఆచరించి చూపాలని సింహాద్రి హితవు పలికారు.

# హైనీ అమ్మకు ఎమ్మెల్యే పేర్ని నాని నివాళి



హైనీ అమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని

**మచిలీపట్నంటౌన్:** హైనీ అమ్మ 109వ జయంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హైనీ అమ్మ సమాధి వద్ద బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విదేశాల నుంచి వచ్చిన ఆమె మచిలీపట్నం ప్రాంతంలో ఉన్న పేదలకు విద్యను అందించేందుకు విద్యా సంస్థను స్థాపించి చేసిన సేవ మరువరానిదన్నారు. తల్లిదండ్రులు లేని అనాథ చిన్నారులకు వసతి ఏర్పాటు చేయడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పారని చెప్పారు. హైనీ విద్యా సంస్థల పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హైనీ విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొని హైనీ అమ్మకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

# చంద్రబాబు పేదలకు క్షమాపణ చెప్పాలి

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బసవయ్య డిమాండ్
- చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసన
- అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బసవయ్య

**అవనిగడ్డ:** అమరావతిలో పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తుంటే చంద్రబాబుకి కడుపుమంటగా ఉందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య అన్నారు. విశాఖలో చంద్రబాబు పేదలను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బసవయ్య స్థానిక విలేకరులతో మాట్లాడారు. పేదలకు ఇచ్చిన నివేశన స్థలాలు శవాలను పూడ్చడానికి కూడా చాలవని హేళనగా మాట్లాడిన చంద్రబాబు తక్షణమే ఇళ్లస్థలాల లబ్ధిదారులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పేదలకు సొంతింటి కలను నిజం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది పేదలకు జగనన్న కాలనీల ద్వారా నివేశన స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తుంటే చంద్రబాబు ఓర్చుకోలేక పోతున్నారన్నారు. వీటిని అడ్డుకునేందుకు గతంలో ఆ పార్టీ నాయకులను అడ్డం పెట్టుకుని కోర్టుల ద్వారా ఆపాలని చూశారని, అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కడుపుమంటతో చంద్రబాబు రగిలి పోతున్నారని బసవయ్య ఎద్దేవా చేశారు. కలల రాజధాని అమరావతిని తమ పార్టీ నాయకుల ద్వారా చంద్రబాబు రియల్ ఎస్టేట్ దందాగా మారిస్తే, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు గూడు కల్పిస్తున్నారని వివరించారు. నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పులిగడ్డ పంచాయతీలోని రేగుల్లంకలో కోర్టుకు వెళ్లి వంతెన పనులు ఆపించిన వారే నేడు ఎస్సీలను పట్టించుకోవడం లేదని నీతి కబుర్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, లంకమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్, ట్రేడ్ యూనియన్ మండల కన్వీనర్ గార్లపాటి గోపీ, ఎస్సీ సెల్ నాయకులు మద్దాల వీరాస్వామి, నాయకులు పాల్గొన్నారు.

# రీ సర్వే ముసాయిదా జాబితా ప్రదర్శన

**గూడూరు:** గూడూరు మండలం గురిజేపల్లిలో పూర్తయిన రీ సర్వేకు సంబంధించి ముసాయిదా జాబితాను శుక్రవారం ప్రదర్శించారు. ఉదయం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో తహసీల్దారు బీవీ ప్రసాద్ మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా మండలంలో రీ సర్వే పూర్తయిన మొదటి గ్రామంగా గురిజేపల్లి నిలిచిందన్నారు. సర్వే సిబ్బంది ప్రతి కమతాన్ని సర్వే చేసి రైతుల వివరాలతో డిజిటల్ ల్యాండ్ రిజిస్టర్ తయారు చేశారన్నారు. దీనికి సంబంధించిన ముసాయిదా జాబితాను పంచాయతీ కార్యాలయంలో ప్రచురించామని ఆయన చెప్పారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లో తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

అభ్యంతరాలపై విచారణ నిర్వహించి తుది జాబితాతో కూడిన గెజిట్‌ను ప్రచురిస్తామని చెప్పారు. గూడూరు మండల వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, మండల సర్వేయర్ జి.వెంకటేశ్వరరావు, సర్వే డీటీ సాయి, వీఆర్వో వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి



మోపిదేవిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



గూడూరులోని దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న భాస్కరరావు

**చల్లపల్లి:** ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని చల్లపల్లి పంచాయతీ ఈఓ పడమట సుకుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు పూర్తి స్థాయిలో విడిచిపెట్టాలని సూచించారు. దుకాణదారుల వద్దకు వెళ్లి నిబంధనలు వివరించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ**

**మోపిదేవి:** మోపిదేవిలో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ పార్వతి మాట్లాడుతూ వ్యర్థాలు తొలగించి గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మే 19 నుంచి జూన్ 4వ తేదీ వరకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోందని చెప్పారు. అనంతరం చిరు వ్యాపారులకు, కూరగాయల వ్యాపారులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్‌డీ అరుణ కుమారి, గ్రామ కార్యదర్శి త్రిపుర సుందరి, సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్ సంచులతో పర్యావరణానికి హాని**

**గూడూరు:** ప్లాస్టిక్ సంచులతో పర్యావరణానికి తీరని హాని కలుగుతుందని గూడూరు మండల ఈఓపీఆర్డీ టీవీ భాస్కరరావు అన్నారు. మిషన్ లైఫ్‌లో భాగంగా గూడూరులో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాలకు వెళ్లిన ఈఓపీఆర్డీ భాస్కరరావు పర్యావరణానికి ప్రమాదం కలిగించే ప్లాస్టిక్ సంచులను విక్రయించవద్దని చెప్పారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

### టెన్త్ టాపర్‌కు మంత్రి జోగి రమేష్ అభినందన



**పెడన:** పదో తరగతి ఫలితాల్లో పెడన నియోజకవర్గంలో టాపర్‌గా నిలిచిన కళాంజలి హైస్కూల్ విద్యార్థిని అబ్దుల్ కౌశర్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అభినందించి సత్కరించారు. శుక్రవారం పెడన మార్కెట్ కమిటీ చైర్మన్ చాంబర్‌లో అత్యధిక మార్కులు సాధించిన కళాంజలి హైస్కూల్ విద్యార్థులను మంత్రి అభినందించారు. కౌశర్ (592), షేక్ రహమాన్ (581), లహరి (571)లను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, పెడన పట్టణ, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు యోగా, ధ్యానంలో శిక్షణ



**మచిలీపట్నంటౌన్:** నగరంలోని పలు గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు యోగా, ధ్యానంలో శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో చిన్నారులతో యోగా చేయించారు. అనంతరం పుస్తక పఠనం, పద్యపఠనం, చిత్రలేఖనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

### సర్వే సిబ్బందికి సహకరించండి

**మోపిదేవి:** మండలంలోని మోపిదేవి, పెదప్రోలు, వెంకటాపురం గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ఫేస్–2లో భాగంగా రీ–సర్వేను ప్రారంభించామని తహసీల్దార్ కె. నవీన్ కుమార్ శుక్రవారం తెలిపారు. రీ–సర్వేలో రైతులు వారి భూమికి సంబంధించిన హక్కు పత్రాలు, పాసు పుస్తకాలతో వారి భూమి వద్ద హాజరై సర్వే బృందం, రెవెన్యూ వారికి సహకరించాలని కోరారు.